క్లుప్తంగా

నేడు సామర్లకోట మండల పరిషత్ సమావేశం

పెద్దాపురం/సామర్లకోట: జీపీడీపీ, బీపీడీపీపై సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సామర్లకోట ఎంపీడీఓ కరక హిమ మహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆమె కోరారు.

గ్రామసభలో 40 దరఖాస్తులు

కొత్తపల్లి: గ్రామ సచివాలయం వద్ద మంగళవారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామ సభ జరిగింది. పలు భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. గ్రామసభలో మొత్తం 40 దరఖాస్తులు అందినట్లు చిన్నారావు తెలిపారు. బుధవారం ఉప్పాడ, 14న సుబ్బంపేట, 16న గోర్సలో గ్రామసభలు ఉంటాయని చెప్పారు.

బీచ్ రోడ్డులో ప్రమాద ఘంటికలు



కెరటాల తాకిడికి ధ్వంసమైన ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు

కొత్తపల్లి: కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు ప్రాణాంతకంగా మారింది. ఈ రోడ్డులో అధికారులు ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ముఖ్యంగా రోడ్డు గోతులమయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం ప్రయాణికులకు దినదిన గండంగా మారింది. కెరటాల తాకిడికి బీచ్ రోడ్డు కోతకు గురవుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సర్వత్రా ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డును పటిష్టపర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గత నెల 28వ తేదీన గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన దిమ్మిలి కృష్ణ(36) వ్యవసాయ కూలి పనులకు వెళ్లి సుబాబుల్ చెట్టు కొమ్మలు నరుకుతూ ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. దీంతో అతనికి వెన్నుపూసకు బలమైన గాయాలయ్యాయి. అప్పటి నుంచి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. సోమవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య దిమిలి నరస అలియాస్ కృప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ రామకృష్ణ తెలిపారు.

అదృష్టం వరించేనా..?

- చురుగ్గా సాగుతున్న ఖరీఫ్ వరి కోతలు
- కూలీల రేట్లు పెరగడంతో, యంత్రాలపైనే ఆధారం
- ఆందోళనకు గురిచేస్తున్న వాతావరణ పరిస్థితులు
- మరోవైపు రబీ సాగుకు అన్నదాతల సన్నద్ధం



పీబీసీ పరిధిలో ప్రారంభమైన వరికోతలు



వరి కోత యంత్రంతో నూర్పులు

పిఠాపురం: గత ఏడాది అకాల వర్షాలు, వరదలు, తుపాన్ల వల్ల చేతికందాల్సిన పంట నీటిలో కొట్టుకుపోయింది. ఉన్న కొద్దిపాటి పంట నీటిలో తడిసి కుళ్లిపోయింది. ఆ చేదు అనుభవం నుంచి తేరుకోకముందే ప్రస్తుత ఖరీఫ్‌లో వచ్చిన అకాల వర్షాలు, ఏలేరు వరదలు రైతును తీవ్ర ఇబ్బందులు పెట్టినా, చివరకు సానుకూలంగానే కోత దశకు తీసుకువచ్చాయి. ప్రస్తుతం ఖరీఫ్ కోతలు ప్రారంభం కాగా, రబీకి అవకాశం ఇవ్వనుండడంతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వాతావరణం ఇబ్బందులకు గురి చేసినా, రైతన్న ధైర్యంగా పంటల సాగులో ముందుకు వెళ్లడంతో పంటల సాగులో బిజీబిజీగా మారారు.

పాలకుల నాన్చుడు ధోరణి

ప్రభుత్వం వరి పంటకోత దశకు చేరుకున్న వెంటనే నాన్చుడి ధోరణి లేకుండా ఏలేరు, పీబీసీ పరిధిలో రబీ సాగుపై అధికారులు నిర్ణయం ప్రకటించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఏ ప్రకటనా లేకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. అయినప్పటికి కోతలు ప్రారంభించిన రైతులు వెనువెంటనే రబీ సాగుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. పీబీసీ పరిధిలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే 40 శాతానికి పైగా వరిపంట కోతకు సిద్ధమవ్వగా, రబీకి నారుమళ్లు సిద్ధం చేసుకునే పనిలో రైతులు సన్నద్ధమవుతున్నారు.

యంత్రాలపైనే ఆధారం

నియోజకవర్గ పరిధిలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి మండలాల పరిధిలోను వరికోతలు చేపట్టేందుకు యంత్రాలను సిద్ధం చేస్తున్నారు. కూలీ రేట్లు అమాంతంగా పెరగడంతో రైతులు వరి కోత యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. ఎప్పుడూ లేని విధంగా 70 శాతం పైగా వరి కోత యంత్రాలను ఆశ్రయించారు. వాతావరణం ఇబ్బందికరంగా మారుతుండడంతో పంటను త్వరితగతిన ఇంటికి చేర్చుకునేందుకు ఈ వరి కోత యంత్రాలను ఉపయోగించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ 2,800 వరకు వరికోత యంత్రానికి అద్దెగా ఇస్తున్నామని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత కూలీ రేట్లతో బేరీజు వేసుకుంటే వరికోత యంత్రం రైతుకు లాభసాటిగా మారిందంటున్నారు.

యంత్రాలతోనే వరి కోతలు



కూలీల కొరత ఏర్పడడంతో వ్యవసాయంలో యంత్రాలకు పని చెప్పాల్సి వస్తోంది. వరి కోతలకు 90 శాతం మంది రైతులు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. యంత్రాలను వినియోగించడం వలన ఖర్చు భారం తగ్గుతుంది. రైతులకు భారం కూడా తగ్గుతుంది. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

– కె.సత్యనారాయణ, రైతు, కొమరగిరి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఎరువులు, పురుగు మందుల వాడకంతో పాటు, భూసార పరీక్షల ఆధారంగా ఏ విత్తనాలు వాడాలనే విషయాలను కూడా తెలియపరుస్తున్నాం. ధాన్యం కొనుగోలు విషయంలో కూడా సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– సత్యనారాయణ, వ్యవసాయాధికారి, గొల్లప్రోలు

ప్రజల నుంచి సీపీఐ అర్జీల స్వీకరణ



పిఠాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తాటిపాక మధు తదితరులు

పిఠాపురం: ఇంటి పట్టా ఉన్నా స్థలం పొందనివారు, స్థలం ఉన్నా ఇల్లు కట్టుకోలేనివారు, ఇళ్లు లేని నిరుపేదలు ఈ నెల 18న ఆయా వార్డు సచివాలయాల వద్దకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. మంగళవారం పిఠాపురం నియోజకవర్గంలో సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నేతలు సంయుక్తంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఠాపురంలో జగ్గయ్య చెరువు, రథల పేట, ఇందిరా నగర్, ప్రాంతాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ మాట్లాడుతూ, మున్సిపల్, జట్ల కార్మికుల నుంచి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిందని, ఈ నేపథ్యంలో ఇళ్లు లేని పేదలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శాఖ రామకృష్ణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అప్పారావు, సూర్యారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సీపీఎం జిల్లా మహా సభలు



సమావేశంలో మాట్లాడుతున్న నీలపాల సూరిబాబు

పెద్దాపురం: ఈ నెల 17వ తేదీ నుంచి జరగాల్సిన సీపీఎం జిల్లా మహాసభలు 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ విస్తృత సమావేశం డి.క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగింది. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మహాసభల తేదీలను మార్చినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 21, 22వ తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నామన్నారు. మహాసభల తేదీల మార్పును ప్రతి ఒక్కరు గమనించి, సహకరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు,చల్లా విశ్వనాథం, కూనిరెడ్డి అప్పన్న, అరుణ, డి.కృష్ణ, ఆర్.వీర్రాజు, నరసింహమూర్తి, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ దైవకుమార్

పెద్దాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియెగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఏడిఏ ఎస్.దైవకుమార్ అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ దైవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో పీపీసీ సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్ పశు గణన సర్వే చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు పశువులకు బీమా చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు బి.రాగ స్రవంతి, సత్య, రైతులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులను కించపరిస్తే సహించేది లేదు

- టీడీపీ నేత బహిరంగ క్షమాపణ చెప్పాలి
- పట్టణ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్



నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

పిఠాపురం: నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని పట్టణ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సభ్యులు హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం పిఠాపురంలో వారు మాట్లాడుతూ, కడపకు చెందిన టీడీపీ నేత జిలాన్ బాషా నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా మాట్లాడటం అతని అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. ఇలాంటి వ్యక్తులను పార్టీ నుంచి సస్పెండ్ చేసి, అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలు, బీసీలపై వారికున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలపై, బీసీలపై నోటికి వచ్చినట్టు, ఇష్టానుసారంగా మాట్లాడే ఇలాంటి వ్యక్తులపై ఆయా పార్టీల అధిష్టానాలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. తమను కించపరిచే వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా జాయింట్ సెక్రెటరీ నల్లమిల్లి అర్పణ కుమార్, పట్టణ ప్రెసిడెంట్ అల్లూరి వెంకటపతి, సెక్రటరీ నల్లమిల్లి పవన్ కుమార్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అపాయకరంగా వంతెన



బీచ్ రోడ్డులో శీలంవారిపాలెం వద్ద ప్రమాదకరంగా ఉన్న వంతెన

కొత్తపల్లి: ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డులో ఉప్పుటేరుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ప్రయాణ/ కులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై తరచూ వందలాది వాహనాలు ప్రయాణిస్తాయి. దీంతో వంతెనపై తరచూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. అంతేకాకుండా ఎదురెదురు వాహనాలు వచ్చినా కూడా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి, వంతెనపై కూలిపోయిన రక్షణ గోడలను పునర్నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

హరోం హరా..!

- భారీగా శివ దీక్షల స్వీకరణ
- శివాలయాలకు పోటెత్తుతున్న భక్తులు



పాదగయ క్షేత్రంలో శివ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

పిఠాపురం: అత్యంత పవిత్రమైన కార్తిక మాసంలో వందలాది మంది భక్తులు శివ దీక్షలు చేపడుతున్నారు. అయ్యప్ప స్వామి దీక్షల మాదిరిగానే 41 రోజుల పాటు దీక్షలు నిర్వహించనున్న భక్తులు, కార్తిక మాసం ప్రారంభం నాటి నుంచి దీక్షలు స్వీకరిస్తున్నారు. అన్ని శివాలయాల్లోను శివ భక్తుల సందడి ప్రారంభమైంది. పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి వారి సన్నిధిలో ప్రతి రోజు వందల మంది శివ దీక్షలు స్వీకరిస్తున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు శివ మాలధారణ చేస్తున్నారు. నిత్యం పలువురు శివ భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి, ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొంటున్నారు. ఆలయాలన్నీ శివ నామస్మరణతో మార్మోగుతుండగా, శివ భక్తులు ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వస్తున్న శివ భక్తులు కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయంలో దీక్షలు స్వీకరించడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఎక్కువ మంది శివ భక్తులు ఆలయంలోనే ఉంటూ దీక్షలు కొనసాగిస్తుంటారు. దీక్షల అనంతరం పాదగయ క్షేత్రంలోనే ఇరుముడులు స్వామి వారికి సమర్పించనున్నారు. శివ భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


భీమేశ్వర ఆలయంలో పూజలు

పెద్దాపురం/సామర్లకోట: కార్తికమాసం ఏకాదశిని పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కార్తిక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాసం రెండో వారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఉపవాస దీక్షలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అలాగే స్థానిక మఠం సెంటర్ వీరభద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ప్రత్యేక పూజలు చేశారు.

కుక్కుటేశ్వరునికి కార్తిక పూజలు

పిఠాపురం: పవిత్ర కార్తికమాసంలో పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శివునికి ప్రీపాత్రమైన కార్తికమాసం కావడంతో పాదగయ పుణ్యక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి వారికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేయగా, పలువురు భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదగయ పుష్కరిణిలో పలువురు భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, కార్తిక దీపాలు వదిలారు. బ్రాహ్మణులకు కార్తిక దీపాలను దానాలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో కుక్కుటేశ్వర స్వామివారు



సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు



వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిన రాజప్ప